ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 99 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 13 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ప్రధాని మోదీ పాదాలకు నమస్కరించేందుకు తీశ్ యత్నం

ప్రధాని మోదీ పాదాలకు నమస్కరించేందుకు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ (73) ప్రయత్నించిన పరిణామం బిహార్లో చోటుచేసుకుంది.




ప్రధాని మోదీ పాల్గొన్న ఓ సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ (73) ప్రధాని పాదాలకు నమస్కరించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆయన్ను నిలువరించేందుకు ప్రధాని మోదీ (74) ప్రయత్నం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. బిహార్లోని దర్భంగాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది.మోదీ పాదాలకు నీతీశ్ నమస్కరించేందుకు ప్రయత్నించడం ఈ ఏడాది మూడోసారి కావడం గమనార్హం. జూన్లో పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ప్రధానిని కలిసిన సందర్భంలోనూ మోదీ పాదాలను తాకేందుకు ప్రయత్నించి నీతీశ్ అందర్నీ ఆశ్చర్యపరిచారు. అంతకుముందు లోక్సభ ఎన్నికల సమయంలోనూ నవాదాలో నిర్వహించిన ఓ సభలో ప్రధాని పాదాలను తాకారు.బీహార్లోని దర్భంగాలో ఎయిమ్స్కు శంకుస్థాపనతోపాటు రూ.12వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ.. నీతీశ్ కుమార్పై ప్రశంసలు కురిపించారు. 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకువచ్చారని కొనియాడారు.

# ఎంవీఏ గెలిచిందో.. కాంగ్రెస్కు 'మహా' ఏటీఎం: అమిత్ షా

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) గెలిస్తే.. మహారాష్ట్ర కాంగ్రెస్కు ఏటీఎంలా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

జల్గావ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి గెలిస్తే.. మహారాష్ట్రను కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలోని వనరులను ఉపయోగించుకొని, నిధులను విత్ట్ చేసి దిల్లీకి తరలిస్తారని ఆరోపించారు. ఈ నెల 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ జల్గావ్ జిల్లాలోని చాలిస్గావ్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. భాజపా సారథ్యంలోని మహాయుతి కూటమికి ఓటు వేసి గెలిపిస్తే.. ప్రధాని మోదీ సహకారంతో మహారాష్ట్ర మరింతగా అభివృద్ధి చెందుతుందున్నారు.ఝార□ండ్లో భాజపా ప్రభుత్వమే ఏర్పాటువుతుందని ధీమా వ్యక్తం చేసిన అమిత్ షా.. మహారాష్ట్రలోనూ 'మహాయుతి' గెలుపు ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నకిలీ హామీలతో ప్రజలను తప్పుదోవపట్టించడమే ఇందుకు కారణమన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీల్లో ప్రదర్శించే రాజ్యాంగ ప్రతి అసలైంది కాదని.. అది నకిలీదన్నారు. కొందరు పాత్రికేయులు దాన్ని చూడగా.. అందులో ఖాళీ పేజీలే ఉన్నాయన్నారు. నకిలీ ప్రతిని చూపించి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడం ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్ను అవమానించారని ధ్వజమెత్తారు.గత యూపీఏ పాలనలో ఓటు బ్యాంకు రాజకీయాలతో దేశంలో నక్సలిజం, ఉగ్రవాదం సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ రాజకీయమంతా మోసంతోనే నడుస్తుందని.. మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం వచ్చాక పెట్టుబడులు తగ్గిపోయాయని ప్రచారం చేస్తున్నారన్నారు. కానీ, ఏక్నాథ్ శిందే సారథ్యంలో 'మహాయుతి' పాలనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో మహారాష్ట్ర నంబర్ వన్గా నిలిచిందని తెలిపారు. శరద్ పవార్ను టార్గెట్ చేస్తూ.. ఆయన సీఎంగా, కేంద్రమంత్రిగా ఎన్నో సంవత్సరాలుగా పనిచేసినా మరాఠా భాషకు ప్రాచీన హోదా కల్పించేందుకు కృషిచేయలేదని విమర్శించారు.



## 'మీ కాళ్లపై మీరు నిల్చోవడం నేర్చుకోండి'.. అజిత్ పవార్ వర్గానికి సుప్రీం చురక



దిల్లీ, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఎన్సీపీ చీఫ్ అజిత్ పవారు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఎన్సీపీ వ్యవస్థాపకుడైన శరద్ పవార్ ఫొటోలు, వీడియోలు ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దని ఆదేశించింది. అలాగే సొంతకాళ్లపై నిల్చోవడం నేర్చుకోవాలని చురకలు వేసింది. గతేడాది ఎన్సీపీ నుంచి చీలిపోయి మెజార్టీ ఎమ్మెల్యేలతో కలిసి భాజపా- శిందే సర్కారుకు మద్దతు పలికిన అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ-స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలూ మంత్రులయ్యారు. దాంతో పార్టీ రెండుగా చీలిపోగా.. అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్సీపీగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ వర్గమే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును దక్కించుకుంది. అయితే ప్రస్తుతం జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ పవార్ దృశ్యాలను వాడుతున్నారని ఆరోపిస్తూ ఆయన మద్దతుదారులు సుప్రీంను ఆశ్రయించారు. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది.

# రామ్ గోపాల్ వర్మ ఇంటికి వెళ్లిన ఏపీ పోలీసులు

వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) కు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు.




హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) కు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు.. జూబ్లీహిల్స్ లోని ఆర్జీవీ ఇంటికి వచ్చి అందజేశారు. ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలోని బృందం నోటీసులు ఇచ్చింది. ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వర్మ ఎక్స్లో పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్లో కేసు నమోదైంది. మద్దిపాడు మండల తెదేపా కార్యదర్శి ఎం.రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు నోటీసులు అందజేశారు. మరోవైపు తుళ్లూరులోనూ ఆర్జీవీపై కేసు నమోదైంది. చంద్రబాబు, పవన్కల్యాణ్, లోకేశ్ ఫొటోలను రామోపాల్ వర్మ గతంలో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టారని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు తుళ్లూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# విజయనగరం జేసీపై ఈనాడు కథనం.. స్పందించిన హోంమంత్రి అనిత


విజయనగరం జేసీగా పని చేసిన కిశోర్ కుమార్ గురించి 'ఈనాడు' ప్రచురించిన కథనం పై ఆ జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనిత స్పందించారు.



అమరావతి, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): విజయనగరం జేసీగా పని చేసిన కిశోర్ కుమార్ గురించి 'ఈనాడు' ప్రచురించిన కథనంపై ఆ జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనిత స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లాలో జాయింట్ కలెక్టర్ కిశోర్ కుమార్ నేతృత్వంలో విలువైన ప్రభుత్వ భూముల ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలపై హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.రికార్డులను పట్టించుకోకుండా ఇష్టానుసారం భూములను రాసిచ్చిన ఉదంతాలపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం, భోగాపురం, కొత్తవలస, బొబ్బిలి, పార్వతీపురం,దత్తిరాజేరు, జామి మండలాల్లో భూములకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు అందినట్లు మంత్రి పేర్కొన్నారు.

# అమరావతిలోనే హెచ్ఎర్సీ, లోకాయుక్త కమిషన్: ఏపీ ప్రభుత్వం

హెచ్ఐర్సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది.




అమరావతి, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): హెస్ఆర్సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. హెన్ఆర్సీ, లోకాయుక్త కమిషనన్ను అమరావతిలోనే ఉంచుతామని, అందుకు వీలుగా చట్టసవరణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు మూడు నెలలకు వాయిదా వేసింది. హెచ్ఎర్సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

# ప్రియురాలిని హతమార్చి.. పత్తి చేలో పాతిపెట్టి


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో దారుణం జరిగింది. స్వాతి అనే యువతి దారుణ హత్యకు గురైంది.



జూలూరుపాడు , నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలోదారుణం జరిగింది. స్వాతి అనే యువతి దారుణ హత్యకు గురైంది. ఆమె ప్రియుడు వీరభద్రం.. యువతిని అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి పొలంలో పాతిపెట్టాడు. మూడు రోజుల తర్వాత హత్య ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మణుగూరు మండలం తోగ్గుడేనికి చెందిన స్వాతి (32) ఆరేళ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ మాచినేనిపేట తండాలోనే ఉంటోంది. భద్రం భార్యతో పాటు స్వాతి కూడా ఒకే ఇంట్లో ఉంటున్నారు. కుటుంబ తగాదాలు, ఆర్థిక లావాదేవీలతోపాటు పలు కేసుల్లో భద్రం నిందితుడిగా ఉన్నాడు. కొంకాలంగా భద్రం, స్వాతిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రియురాలి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న భద్రం.. ఈనెల 9న తన ఇంట్లోనే స్వాతిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని తన పత్తి పొలంలో పాతిపెట్టాడు. కొత్తగూడెం డీఎస్పీ, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు.. మృతదేహాన్ని వెలికి తీసే చర్యలు చేపట్టారు.

# శాసన మండలిలో బొత్స, అచ్చెన్నాయుడి మధ్య వాగ్వాదం

విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది.



అమరావతి, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తిప్పికొట్టారు. ప్రభుత్వం తరపున ఇంకా పర్యవేక్షణ లోపం ఉందని బొత్స ఆరోపించారు. మృతుల విషయంలో స్పష్టత లేదన్నారు.అనంతరం అచ్చెన్నాయుడు స్పందిస్తూ గత ఐదేళ్లలో వాటర్ ట్యాంక్లలో పిడికెడు బ్లీచింగ్ కూడా వేసిన సందర్భాలు లేవన్నారు. పంచాయతీలకు పైసా నిధులు కేటాయించకపోగా.. కేంద్రం ఇచ్చిన వాటినీ దారిమళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకోట్లతో పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు చేపట్టిందన్నారు. గుర్ల ప్రాంతానికి ఇన్నాళ్లు ప్రాతినిధ్యం వహిస్తున్నందున తన వల్ల కూడా ఇది జరిగిందని ఒప్పుకోవాలని బొత్సకు అచ్చెన్న హితవు పలికారు.

# ప్రజల తిరుగుబాటును భారాసకు ఆపాదించే కుట్ర: కేటీఆర్

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్రెడ్డి అరెస్టును భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు.



హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్రెడ్డి అరెస్టును భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రజలు చేసిన తిరుగుబాటును భారాసకు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలతో మాట్లాడినా నేతలను అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు అణచివేతకు అప్రజాస్వామిక చర్యలకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు తప్పవని బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. తమను భయపెట్టాలని చూస్తే అది మూర□పు చర్యే అవుతుందన్నారు. సీఎం రేవంత్రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎంత అణచివేసే ప్రయత్నం చేస్తే అంతగా పోరాటం చేస్తామన్నారు. లగచర్లలో అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడాన్ని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రవు ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పాలన గాలికి వదిలి అక్రమ కేసులతో రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరిట చిచ్చు పెట్టడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులతో అణచివేయలేరన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హరీశ్రావు పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# రేపటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

## గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి.




నంద్యాల, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా సమాజాభివృద్ధిలో తోడ్పాటు నందించాలని గ్రంథాలయ అధికారిణి రాధాబాయి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతయే సమాజాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహించగలరని, సెల్(చరవాణి)ల ద్వారా ఇంట్లో సమయాన్ని గడపకుండా, గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠణము అలవరచుకోవాలని , అలాగే పిల్లల తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు ప్రతి రోజు గ్రంథాలయాలను సందర్శించేల ప్రేరణ కల్పించి, తమ పిల్లల భవిష్యత్తుకు మార్గ దర్శకులుగా నిలవాలని కోరుతున్నామన్నారు. 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమ వివరములు : 14వ తేదీన గురువారం బాలల దినోత్సవం , 57 వ జాతీయ గ్రంథాలయ వారోవత్సవాల ప్రారంభ వేడుకలతో మొదలుకొని, 15 తేదీన పుస్తక ప్రదర్శన, ప్రముఖుల చేత పుస్తక పఠనం-ప్రాముఖ్యత గురుంచి ప్రసంగాలు, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం గ్రంధాలయ అభివృదికి ఎన్నో సేవలు చేసిన రంగనాధన్ తదితరులను స్మరించుకోవడం మరియు



విద్యార్థులకు "పిల్లల పై స్మార్ట్ ఫోన్ ప్రభావం" అను అంశము పై వ్యాసరచన పోటి మరియు "భూమి మహాసముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యం- నివారణ చర్యలు" అను అంశము పై వక్తృత్వ (ఉపన్యాసం) పోటీలు నిర్వహించబడును, 17వ తేదీన కవి సమ్మేళనం- కవుల, రచయితల సందేశాలు , ఉపన్యాసాలు, 18వ తేదీన విద్యార్థులకు "నీటిని కాపాడండి - జీవితాన్ని కాపాడండి" అను అంశము పై చిత్రలేఖన పోటీలను నిర్వహించబడును. 19వతేదీన మంగళవారం మహిళా దినోత్సవం- మహిళాసాధికారత పై చర్చ, 20వ తేదీన ముగింపు వేడుకలు, ప్రముఖులచే పిల్లలకు బహుమతుల ప్రధానోత్సవం జరుగును. పై కార్యక్రమాల్లో పాల్గొనుటకు అందరూ ఆహ్వానితులే అని, అందరూ తప్పక హాజరై కార్యక్రమాలు జయప్రదం చేయాలని గ్రంథాలయ అధికారిణి ఎస్.రాధా భాయి , రికార్డు అసిస్టెంట్ ఆర్.ఇ.శ్రీధర్ కోరారు.

# లగచర్ల దాడి ఘటన.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

**వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారుల పై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 16 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.**



వికారాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 16 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. ఏ1గా భోగమోని సురేశ్ను చేర్చారు. ఈ నెల 11న లగచర్లలో జరిగిన ఘటనపై డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ కోసం జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికారులు వచ్చిన సమయంలో కొందరు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని చెప్పారు. అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్, కడా అధికారి వెంకట్రెడ్డిపై హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. రాళ్ల దాడి కారణంగా కలెక్టర్, ఇతర అధికారులు, పోలీసులకు సైతం గాయాలయ్యాయని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ కోసం ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ లింగయ్య, తాండూరు ఇన్ఛార్జి కలెక్టర్ ఉమాశంకర్, తహసీల్దార్లు కిషన్ నాయక్, విజయ్కుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి లగచర్లకు వచ్చారని పేర్కొన్నారు. మొదట గ్రామ శివార్లలో గ్రామ సభ ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం సురేశ్ అనే వ్యక్తి కలెక్టర్ సహా ఇతర అధికారులను గ్రామంలోకి తీసుకువెళ్లాడని చెప్పారు. కలెక్టర్ వెళ్లిన సమయంలో అందరూ ఒకేసారి గుమిగూడారని.. ఆయన వాహనాన్ని అడ్డగించి నినాదాలు చేశారని తెలిపారు. కలెక్టర్ కారు దిగి వారి వద్దకు వెళ్లి మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తుండగానే.. దాడి చేసి వాహనాలపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారన్నారు. ఘటనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో ఉపయోగించిన రాళ్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

# బండారులంకలో ఉద్రిక్తత..

## భారీగా మోహరించిన పోలీసులు

**అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకలో ఉద్రిక్తత నెలకొంది.**

బండారులంక, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకలో ఉద్రిక్తత నెలకొంది. తమ ఇళ్ల మధ్య డంపింగ్ యార్డును తొలగించాలంటూ గ్రామస్థులు ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిలో భారీగా మోహరించారు. తమ ఇళ్ల మధ్య చెత్త వేయవద్దంటూ చెత్త ట్రాక్టర్లను గ్రామస్థులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. తమ పైనుంచి ట్రాక్టర్లను



ఎక్కించండి అంటూ మహిళలు వాహనాలకు అడ్డుగా నిలిచారు. డంపింగ్ యార్డు కారణంగా ఆనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# లగచర్ల ఘటన భారాసకు అంటగట్టే యత్నం: మాజీ మంత్రి సబిత

**లగచర్ల ఘటనను భారాసకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.**



హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): లగచర్ల ఘటనను భారాసకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో సబిత ఫిల్మ్నగర్లోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "వికారాబాద్ జిల్లా లగచర్లలో జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి బాధాకరం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడి భారాస చేయించిందని అంటగట్టే ప్రయత్నం జరుగుతోంది. నరేందర్రెడ్డిని అరెస్ట్ చేస్తే మా పార్టీ సైలెంట్ అవుతుందని అనుకుంటున్నారు. అరెస్టుకు భయపడం.. ప్రజా గొంతుకగా ఉంటాం. ఫార్మా సిటీపై ప్రభుత్వానికే స్పష్టత లేదు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలి" అని సబిత అన్నారు. పట్నం నరేందర్రెడ్డి సతీమణి శ్రుతి మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు కేబీఆర్ పార్కులో వాకింగ్కు వెళ్లామని.. పోలీసులు అక్కడే ఆయన్ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

# వికారాబాద్ ఘటన నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతాం: పొంగులేటి

**వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.**



హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయట పెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు.

# ఎంపీ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం కొనసాగుతున్న గాలింపు

**వైకాపా ఎంపీ అవినాష్రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది.**

కడప, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. అసభ్య పోస్టుల వ్యవహారంలో ఇప్పటికే అరెస్టయిన ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాఘవరెడ్డి కోసం పులివెందుల, లింగాల మండలాల్లో గాలిస్తున్నారు. అవినాష్ పీఏ స్వగ్రామం అంబకపల్లెలో పోలీసులు నిఘా పెట్టారు. మరోవైపు పులివెందులలో నమోదైన



అట్రాసిటీ కేసులో అనుమానితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

# అంబటి ఇంట్లో.. వైకాపా సోషల్ మీడియా సైకో అరెస్ట్

**వైకాపా కార్యకర్తను ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు పట్టించారు.**



గుంటూరు, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): వైకాపా కార్యకర్తను ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు పట్టించారు. హోంమంత్రి అనితపై పల్నాడు జిల్లా నకరికల్లుకు చెందిన కార్యకర్త రాజశేఖర్రెడ్డి సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టాడు. దీనిపై నూజివీడులో కేసు నమోదు చేసిన పోలీసులు.. రాజశేఖర్ కోసం గత కొన్ని రోజులుగా గాలిస్తున్నారు. నకరికల్లులో అతడి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం అంబటి రాంబాబు స్పందిస్తూ రాజశేఖర్ తమ ఇంట్లోనే ఉన్నాడని.. పోలీసులకు చేతనైతే అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. వెంటనే రంగంలోకి దిగిన నూజివీడు పోలీసులు.. గుంటూరులో అంబటి ఇంట్లో ఉన్న రాజశేఖర్ను అరెస్ట్ చేశారు.

# కేంద్రం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు పనులు:మంత్రి నారాయణ

**కేంద్రం నుంచి అనుమతులు రాగానే మెట్రో రైలు ప్రాజెక్ట పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు.**



అమరావతి, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): కేంద్రం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్ట పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల్లో విశాఖ తెదేపా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుపై డీపీఆర్ను సిద్ధం చేశామని.. ఇప్పటికే దీన్ని కేంద్రానికి పంపినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. భుజంగరావు మధ్యంతర బెయిల్ పిటిషన్ కొట్టివేత

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు భుజంగరావు మధ్యంతర బెయిల్ పిటిషన్ ను నాంపల్లి కోర్టు కొట్టివేసింది.**

హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు భుజంగరావు మధ్యంతర బెయిల్ పిటిషన్ ను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. మధ్యంతర బెయిల్ను పొడిగించాలని ఇటీవల ఆయన పిటిషన్ వేశారు. ఈ క్రమంలో పిటిషన్ను కొట్టివేసిన న్యాయస్థానం.. గురువారం సాయంత్రం 4 గంటల లోపు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. గతంలో అనారోగ్య కారణాలతో భుజంగరావు మధ్యంతర బెయిల్ పొందారు. గురువారం దీని గడువు ముగియనుంది.



# బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

**అంబర్పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.**



హైదరాబాద్, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దాని పునరుద్ధరణపై స్థానికులతో మాట్లాడారు. నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించడంతో 16 ఎకరాలు ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందని, స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. నివాసాలు, నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదంటూ స్థానికులకు రంగనాథ్ భరోసానిచ్చారు. హైడ్రా కమిషనర్ రాకతో బతుకమ్మ కుంట పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు భద్రత మధ్య రంగనాథ్ బతుకమ్మ కుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు. కుంటను పునరుద్ధరిస్తాం. కూల్చివేతలు చేపడతామనే అపోహ స్థానికుల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చాను. ప్రస్తుతమున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తాం. చెరువులోకి వరద నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తాం. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉంది. ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయి"అని రంగనాథ్ తెలిపారు.

# అసభ్యకర పోస్టులు.. వారిపై కేసులు పెడితే తప్పేంటి?: హైకోర్టు

**అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది.**

అమరావతి, నవంబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్): అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. జడ్జిలను కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమంది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదని పేర్కొంది. సామాజిక మాధ్యమ కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు




పెడుతున్నారని విజయబాబు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈమేరకు వ్యాఖ్యలు చేసింది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1780 : భారత దేశంలో సిక్కు సామ్రాజ్య స్థాపకుడు రంజిత్ సింగ్ జననం (మ.1839).
- 1899 : చైనా చరిత్రకారుడు, మానవ వర్గ శాస్త్రజ్ఞుడు. హువాంగ్ గ్జియాన్ హన్ జననం (మ.1982).
- 1904 : బహుభాషావేత్త, జాతీయవాది, రచయిత, పాత్రికేయుడు పురిపండా అప్పలస్వామి జననం (మ.1982).
- 1925 : అలనాటి తెలుగు సినిమా నటి, గాయకురాలు టంగుటూరి సూర్యకుమారి జననం (మ.2005).
- 1926 : నాటకోద్యమ కర్త, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఎ.ఆర్.కృష్ణ జననం (మ.1992).
- 1935 : సినిమా నేపథ్య గాయకురాలు పి.సుశీల జననం.(చిత్రంలో)
- 1973 : భారత స్వాతంత్ర్య సమరయోధురాలు బారు అలివేలమ్మ మరణం (జ.1897).
- 1990 : మొట్టమొదటి వెబ్ పేజీ సృష్టించబడింది.
- 2002 : ప్రజా కవి, పద్మవిభూషణ గ్రహీత కాళోజీ నారాయణరావు మరణం (జ.1914).


రంజిత్ సింగ్


వర్గ శాస్త్రజ్ఞుడు.


అప్పలస్వామి


టంగుటూరి సూర్యకుమారి


ఎ.ఆర్.కృష్ణ


పి.సుశీల


బారు అలివేలమ్మ


కాళోజీ నారాయణరావు

## రానా కొత్త షో.. స్ట్రీమింగ్ ఎప్పటి నుంచి అంటే

నటుడు రానా దగ్గుబాటి వ్యాఖ్యాతగా ఒక సరికొత్త కార్యక్రమం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన వివరాలు తాజాగా బయటకు వచ్చాయి.



హైదరాబాద్: నటుడు రానా దగ్గుబాటి వ్యాఖ్యాతగా ఒక సరికొత్త కార్యక్రమం సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వేదికగా ఇది ప్రసారం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన విశేషాలను ఓటీటీ సంస్థ తాజాగా వెల్లడించింది. 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో రానున్న ఈ షో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇది కేవలం టాక్ షో మాత్రమే కాదని.. అంతకు మించిన సరదా సంభాషణలతో ఇది సాగుతుందని పేర్కొంది. దీనిపై రానా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.వెండితెర వేదికగానే కాకుండా ఓటీటీలోనూ వినోదాన్ని పంచేందుకు రానా సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆయన 'రానా నాయుడు'తో ఓటీటీలో విజయాన్ని అందుకున్నారు. తాజాగా హోస్ట్గా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రానా వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఇదేమీ కొత్త కాదు. గతంలో ఆయన 'నెం.1 యారి' అనే టాక్ షోకు హోస్ట్ గా చేశారు. ఇది మంచి ఆదరణను అందుకుంది. టాలీవుడ్కు చెందిన ఎంతోమంది నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొని.. తమ సినిమా విశేషాలతోపాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సరదా విషయాలు కూడా పంచుకున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలో రానున్న 'ది రానా దగ్గుబాటి షో'పై సినీ ప్రియుల్లో ఆసక్తి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొననున్నారు? ఎలాంటి విశేషాలు పంచుకోనున్నారు? అనే విషయాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'సింగం అగైన్' టీమ్ అన్యాయం చేసింది: నిర్మాత భూషణ్ కుమార్

అడ్వాన్స్ బుకింగ్స్ లో 'భూల్ భులయ్యా 3' సత్తా చాటిందని ఆ చిత్రం నిర్మాత భూషణ్ కుమార్ అన్నారు. 'సింగం అగైన్'తో పోటీ పడడం గురించి మాట్లాడారు.



బాలీవుడ్లో లో ఈ ఏడాది దీపావళికి రెండు పెద్ద సినిమాలు విడుదలై బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన సంగతి తెలిసిందే. అజయ్ దేవగణ్ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'సింగం అగైన్', కార్తిక్ ఆర్యన్ నటించిన 'భూల్ భులయ్యా 3' నవంబర్ 1న రిలీజ్ అయ్యాయి. ఈ సినిమాల విడుదలకు ముందు చిత్రబృందాల మధ్య వాదనలు జరిగినట్లు తాజాగా నిర్మాత భూషణ్ కుమార్ వెల్లడించారు. 'సింగం అగైన్' టీమ్ అన్యాయం చేసిందన్నారు. "భూల్ భులయ్యా 3'ను ప్రకటించినప్పుడే మేము విడుదల తేదీని వెల్లడించాం. 'సింగం అగైన్' టీమ్ ఆ తర్వాత చాలా రోజులకు విడుదల తేదీ ప్రకటించింది. అది అన్యాయం. మేము వాళ్లతో ఎన్నోసార్లు చర్చలు జరిపాం. థియేటర్లు సమానంగా పంచాలని కాంపిటీషన్ కమిషన్ ను అభ్యర్థించాం. మా సినిమా కూడా 'సింగం అగైన్' లాంటి పెద్ద చిత్రం కాబట్టి సమన్యాయం చేయాలని కోరాం. కానీ, థియేటర్ల కేటాయింపుల విషయంలో మాకు అన్యాయం జరిగింది. వారికి ఎక్కువ కేటాయించారు. చివరికి మా చిత్రం అడ్వాన్స్ బుకింగ్స్లో హవా చూపించడంతో కొన్ని థియేటర్లు పెంచారు. అంత పెద్ద చిత్రంతో పోటీ పడి రూ.36 కోట్లకు పైగా ఓపెనింగ్స్ సాధించింది. ఎన్నో వాదనల తర్వాత 'సింగం అగైన్' టీమ్ మా సినిమాకు సపోర్ట్ చేసింది. తగినంత సపోర్ట్ లేకపోయినట్లైతే మేము ఓటీటీలో విడుదల చేయాల్సి వచ్చేది. ఎంతో నష్టపోవాల్సి వచ్చేది' అని భూషణ్ కుమార్ తెలిపారు. అజయ్ దేవగణ్ హీరోగా రోహిత్ శెట్టి తెరకెక్కించిన చిత్రం 'సింగమ్ అగైన్'. అక్షయ్ కుమార్, రణ్వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, కరీనా కపూర్, దీపికా పదుకొణె కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.336 కోట్లు వసూలు చేసింది. కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'భూల్ భులయ్యా 3' త్రిప్తి దిమ్రీ కథానాయిక. అనీజ్ బాజ్మీ తెరకెక్కించిన ఈ సినిమా రూ.340 కోట్లు సాధించింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఛాంపియన్స్ ట్రోఫీ 2025..
### పీసీబీ నిర్ణయానికే పాక్ ప్రభుత్వం మద్దతు..!

2025.. ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులు పాక్ నుంచి వెళ్లిపోవడం ఖాయంగానే కనిపిస్తోంది. ఎందుకంటే పీసీబీ నిర్ణయానికి అనుకూలంగా పాక్ ప్రభుత్వం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.




ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని పాకిస్థాన్ నిర్వహిస్తుందా? వేరే దేశానికి అతిథ్య హక్కులు వెళ్లిపోతాయా? అనేది ఇప్పుడందరి మదిలో ఉన్న సందేహం. ఎందుకంటే పాక్కు భారత్ వెళ్లడం అసాధ్యం. హైబ్రిడ్ మోడల్లో టోర్నీని నిర్వహించాలని ఇప్పటికే పీసీబీకి ఐసీసీ సూచించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాత్రం అందుకు ససేమిరా అని పట్టుదల ప్రదర్శిస్తోంది. ఇదే విషయాన్ని తమ ప్రభుత్వానికి కూడా నివేదించింది. తాజాగా వస్తున్న వార్తల ప్రకారం పాక్ ప్రభుత్వం కూడా పీసీబీకి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆతిథ్యమిస్తే.. ఒక్క మ్యాచ్ కూడా బయట దేశాల్లో నిర్వహించొద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. స్వదేశంలోనే టోర్నీ మొత్తం జరగాలని పాక్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది."మా ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఒక్క మ్యాచ్ కూడా బయటకు వెళ్లేందుకు అనుమతించే ప్రసక్తే లేదు. మేం ఇప్పటికే మా వైఖరి చెప్పాం. భారత్ నిర్ణయం ఏంటో మాకు ఐసీసీ తెలియజేసింది. ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించే హక్కులు మాకే ఉన్నాయి. పాక్ అవల ఒక్క మ్యాచ్ను కూడా నిర్వహించం" అని పీసీబీ వర్గాలు తెలిపాయి. ఒకవేళ ఇదే పట్టుదలతో పీసీబీ ఉంటే మాత్రం ఐసీసీ హోస్ట్ అవకాశాన్ని మరో దేశానికి అప్పగిస్తుందని వార్తలు వస్తున్నాయి. భారత్ లేకుండా మెగా టోర్నీ నిర్వహిస్తే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని పాక్ తోపాటు ఐసీసీకీ తెలుసు. భారత్ - పాకిస్థాన్ (%×చీణ జం్రూాఖ%) జట్ల మధ్య మ్యాచ్ను చూసేందుకు ప్రపంచంలోని క్రికెట్ అభిమానులు భారీగా ఆసక్తిగా చూపిస్తారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పంపించిన ముసాయిదా షెడ్యూల్లోనూ దాయాది జట్లు ఒకే గ్రూప్లో ఉన్నాయి. బీసీసీఐ తమ దేశానికి రాకపోవడానికి సరైన కారణం చెబుతూ రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఈ లేఖలో పీసీబీ పేర్కొంది.

## ఫిట్ నెస్


శరీరం దృఢంగా, బలంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే, బిజీ లైఫ్స్టైల్, దిగజారుతున్న ఆహారపు అలవాట్లు, పొల్యూషన్ కారణంగా శరీరం చాలా బలహీనపడుతుంది. అనేక వ్యాధులకు నిలయంగా మారుతుంది. యువకుల శరీరం కూడా ఉండాల్సినంత చురుకుగా ఉండటం లేదు. దీంతో.. వాళ్ల స్టామినా కూడా తగ్గుతుంది. చాలా మంది మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి పీల్చుకోవడం లేదా ఏదైనా పని చేస్తున్నప్పుడు చాలా త్వరగా అలసిపోతుంటారు. ఇవన్నీ బలహీనమైన శక్తికి సంకేతాలు. కొందరు కండ బలం పెంచడానికి జిమ్లు చుట్టూ తిరుగుతుంటారు. వీక్గా ఉన్నవారు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, కండ బలంతో పాటు స్టామినా పెంచుకోవాలంటే డైట్లో కొన్ని సూపర్ ఫుడ్స్ చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు. వీటిని ప్రతి రోజూ తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. అంతేకాకుండా కండ బలం పెరిగి.. స్టామినా కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఆ సూపర్ ఫుడ్స్ ఏంటో ఓ లుక్కేద్దాం.



## కండ బలం కోసం ఐదు సూపర్ ఫుడ్స్.. వీటిని తింటే మీ స్టామినా డబుల్..



### పీనట్ బటర్..




మీరు బలహీనంగా ఉంటే.. శక్తిని పెంచుకోవడానికి పీనట్ బటర్ ఉపయోగించుకోవచ్చు. పీనట్ బటర్లో ప్రోటీన్, ఒమేగా 3, మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇది క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం యొక్క శక్తి స్థాయి పెరుగుతుంది. అంతేకాకుండా కండరాలు బలపడతాయి. అందుకే జిమ్కి వెళ్లేవారు ఎక్కువగా పీనట్ బటర్ తింటుంటారు. పీనట్ బటర్ పాలతో లేదా రోటీ లేదా బ్రెడ్తో తీసుకోవచ్చని నిపుణులు అంటున్నారు.

### బాదం పప్పు..



బాదంపప్పు తీసుకోవడం వల్ల శరీరం యొక్క స్టామినా పెరుగుతుంది. బాదంలో ప్రోటీన్లు, విటమిన్ ఇ, ఒమేగా 3, ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా పొటాషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు కూడా లభిస్తాయి. బాదంపప్పును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. బాదం పప్పు తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి నియంత్రణలో ఉంటుంది. ప్రోటీన్లు ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి పవర్ అందుతుంది. కండరాలు కూడా బలపడతాయి. నానబెట్టిన బాదం పప్పు లేదా వేయించిన వాటిని తినడం వల్ల లాభాలు కలుగుతాయని నిపుణులు అంటున్నారు.

### అరటి పండు..



అరటి పండులో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇందులో ఎక్కువగా పొటాషియం ఉంటుంది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. అలాగే అరటిలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. రోజు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటి పండు ఎనర్జీ బూస్టర్లా పనిచేస్తుంది. అంతేకాకుండా వ్యాయామాలు, జిమ్ చేసేవారు అరటిపండును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాయి. అరటిపండు అనేది పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ %దీ%6, ఫాస్పరస్ వంటి విటమిన్లు, ఖనిజాల గని. అరటి పండు శక్తి స్థాయిల్ని పెంచుతుంది. రోజూ ఉదయాన్నే తినడం వల్ల శరీరానికి పుష్కలంగా శక్తి లభిస్తుంది. కండ బలం కూడా పెరుగుతుంది.

### ఆకుకూరలు..



ఆకుకూరలు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. శరీరం యొక్క స్టామినాను పెంచడానికి ఆకుకూరలు తోడ్పడతాయి. పాలకూర, బచ్చలి కూర, తోట కూర, మెంతి కూర, మునగాకు వంటి ఆకుకూరలు తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ఆకు కూరల్లో ఐరన్, విటమిన్లు, కాల్షియం పుష్కలంగా లభిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలోని రక్తహీనత తొలగిపోయి కండరాలు, ఎముకలు దృఢంగా మారతాయి. శరీరంలో ఐరన్ లోపం తగ్గుతుంది. ఆకుకూరలు తినడం వల్ల జీర్ణక్రియ మెరగవుతుంది.

### సిట్రస్ ఫ్రూట్స్..



నారింజ, నిమ్మ, ఉసిరి వంటి సిట్రస్ ఫ్రూట్స్ వల్ల శరీర స్టామినా డబుల్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లు విటమిన్ సి యొక్క మంచి మూలం మాత్రమే కాదు.. వీటిలో పుష్కలంగా ఫైబర్, కాల్షియం, ఫోలేట్, థయామిన్, విటమిన్ బి6 ఉంటాయి. ఈ పండ్లను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. అంతేకాకుండా స్టామినా కూడా పెరుగుతుంది. ఈ పండ్ల జ్యూసులు తాగడం వల్ల మరిన్ని లాభాలు శరీరానికి చేకూరతాయంటున్నారు ఎక్స్పర్ట్స్. గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.